క్లుప్తంగా

పోలేరమ్మ ఆలయానికి విరాళం



రూ.50 వేలు అందజేస్తున్న కాంతమ్మ

కడప రూరల్ : కడప నగరం బిల్టప్ వద్ద శ్రీ పోలేరమ్మ ఆలయ తిరునాల సందర్భంగా ఆదివారం భక్తురాలు కాంతమ్మ రూ.50 వేలు అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడుతూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే కాంతమ్మ.. ఆలయానికి రూ.50 వేలు అందజేయడం అభినందనీయమన్నారు. కాగా తిరునాల మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, హరి, వెంకటరత్నం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ పోటీ



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

కడప ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా జరగబోయే (సార్వత్రిక)పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పీ) తరఫున పోటీ చేయబోతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం కడప ఆర్‌ఎస్‌పీ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సోమవారం చెన్నైలో జరిగే ఆర్‌ఎస్‌పీ సెంట్రల్ కమిటీ సమావేశానంతరం అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కళ్యాన్ ఓబులేసు, కమిటీ సభ్యులు రవికాంత్, నరేంద్ర, భాస్కర్, దారాగోపీ, నరసింహారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న నృత్యం



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడపలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి నిర్వాహకులు విజయశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతో పాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పులివెందుల రూరల్ / టౌన్ : శిల్పారామంలో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెంచడంతో శిల్పారామం ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో శిల్పారామం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రికి వేతనాలు పెంచాలని సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. దీనికి ఆయన స్పందించి 2024 ఫిబ్రవరి నెలలో మాకు వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా అబాకస్ పోటీలు



విజేతకు బహుమతిని అందజేస్తున్న సుధీర్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విశ్వం ఎడ్యూటెక్ పొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఆదివారం కడప సాయిబాబా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అబాకస్, వేదిక్ మాథ్స్ జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా స్కూల్ సీఈఓ ఎంవీ సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల వల్ల విద్యార్థుల్లో మ్యాథమాటిక్స్‌పై పట్టు వస్తుందన్నారు. తద్వారా పోటీ పరీక్షలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం ఈ అబాకస్ పోటీల్లో విజేతలకు విశ్వం ఎడ్యూటెక్ పొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెట్ కంపెనీ మేనేజర్లు శివ, నాగార్జున, చిన్నలతో కలిసి ఎంవీ సుధీర్‌కుమార్‌రెడ్డి బహుమతులను అందించి పిల్లలను అభినందించారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం

- ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప రూరల్ : పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. ఆదివారం కడప నగరం నకాష్ వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తూ పోలియో రహిత సమాజ నిర్మాణం చేయాలనే దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్లడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే కడప నగరంలో కూడా పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులను తమకు దగ్గరలోని పోలియో కేంద్రానికి వెళ్లి పోలియో చుక్కలను వేయించాలని కోరారు. ఈ పోలియో చుక్కల కార్యక్రమం కొన్ని సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతోందని, గత 3, 4 సంవత్సరాలుగా భారత దేశ వ్యాప్తంగా ఎక్కడా కూడా పోలియో కేసులు నమోదు కాలేదని, ఈ పోలియో కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన దేశానికి సరిహద్దు దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ గాని ఇతర దేశాల్లో పోలియో కేసులు నమోదు కావడం వల్ల ఆ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండే ఆలోచనలో భాగంగానే భారత ప్రభుత్వం పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగించడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఈ వైరస్ నివారణలో భాగంగా ఇతర దేశాల నుంచి మన దేశానికి రాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని అన్నారు. అంతకుముందు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తోపాటు డీఎంఅండ్‌హెచ్ ఓ డాక్టర్ నాగరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోటకృష్ణ, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డితోపాటు ఇతర అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి పెద్దపులి వద్ద..

చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు పోలియో చుక్కల మందు రక్షణగా నిలుస్తుందని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పీ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక మట్టి పెద్దపులి వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు వయస్సుగల చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని శిక్షణా వైద్యుడు డాక్టర్ సుబహాన్ తెలిపారు. కడప నగరం హరిరావువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్నలత ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబహాన్ మాట్లాడుతూ చిన్నారులు పోలియో మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆదివారం నాడు చుక్కల మందు వేయని చిన్నారుల కోసం సోమ, మంగళ వారాల్లో ఇళ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బందికి సహకరించి తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమాదేవి, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, ధనలక్ష్మి, అయేషా, షంషాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

కడప ఎడ్యుకేషన్ : నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అత్యంత కీలకమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండీ ఇలియాస్‌బాషా అన్నారు. కడపలోని నబికోట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది ప్రసన్న, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం దూరం

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరం అని, ఈ రెండు పోలియో చుక్కల ద్వారా అంగవైకల్యాన్ని దూరం చేయవచ్చని 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ రిజ్వాన్ అన్నారు. ఆదివారం కడపలోని 29 డివిజన్ 13వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ లక్ష్మీదేవి, ఆశ వర్కర్ రాణి, అంగన్‌వాడీ టీచర్ రాణిచెన్నమ్మ, ఆయా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జఫ్రుల్లా



హరిరావువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

పోలియో మహమ్మారిని తరిమి కొట్టాలి

కడప కార్పొరేషన్ : నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ జఫ్రుల్లా అన్నారు. ఆదివారం స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఐదేళ్లలోపు పిల్లలకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని దేశం నుంచి తరిమి కొట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు కరిముల్లా, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశా లక్ష్మీదేవి, కవిత పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరగాలి

కడప కల్చరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు తమవంతు సహకారం అందజేయాలని ఫాస్టర్ మహేష్ కోరారు. ఆదివారం స్థానిక బుడగజంగం కాలనీలోని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ మందిరంలో సిస్టర్ శాంతమ్మతో కలిసి ఆయన ఆదివారపు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజలు ఏమాత్రం నిగ్రహం కోల్పోకుండా, ఎవరూ ఎంతగా రెచ్చగొట్టినా శాంతియుతంగా ఓటింగ్ జరిగేందుకు బాధ్యతగా సహకరించాలని కోరారు. ఎన్నికల్లో పోలీసు, ఇతర అధికారులకు సహకరించాలని కూడా ఆయన తెలిపారు. తమకు సహాయం చేసిన, చేయగల సమర్థుడైన నాయకుడెవరో బేరీజు వేసుకుని వారి సాయాన్ని గుర్తించుకుని ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వాసులు రవితేజ, వెంకటేశ్, రవి, దూపం మహేశ్, శాంతిరాజు, అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

7న ఏఎఫ్‌బీ పార్టీ సమావేశం

కడప రూరల్ : కడపలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఎఫ్‌బీ) జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగులయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిగ శ్రీనివాసులు, శివశంకర్, లక్షుమయ్య, సుబ్బరాయుడు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో విందు భోజనాలను ఆరగించారు. సాయిబాబా, వైద్యనాథీశ్వరుడు, అక్కదేవతలు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.

రవీంద్రనగర్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా



'సిద్ధం' సభలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాబోవు రోజుల్లో రవీంద్రనగర్ ప్రాంతాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం సాయంత్రం రవీంద్రనగర్‌లో కిరణ్‌బార్ వద్ద ఎన్‌ఆర్‌ఐ గ్రూప్, గయాజ్ ఆధ్వర్యంలో 'సిద్ధం' ప్రజా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఒకప్పుడు రవీంద్రనగర్ ప్రాంతం కంపచెట్లతో నిండి ఉండేదని, 2001లో వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంత వాసులకు అధిక ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించిందన్నారు. ప్రతిపక్షనేతగా ఇక్కడి ప్రజల కష్టాలు, కన్నీళ్లు చూసి చలించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వస్తే బుగ్గవంక రక్షణ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారని, 2004లో అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం బుగ్గవంకపై బ్రిడ్జిలు, రక్షణ గోడ నిర్మించారని గుర్తు చేశారు. వైఎస్సార్ మరణానంతరం ఆ పెండింగ్ పనులను కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కావాలనే విస్మరించాయన్నారు. ఎప్పుడు వర్షాలు వచ్చినా ఈ ప్రాంతం నీటమునిగేదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక బుగ్గవంక రక్షణ గోడ పూర్తి చేసి, దాని పక్కనే 40 అడుగుల అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నామని, గుర్రాల గడ్డ, పాత లా కాలేజీ వద్ద కొత్తగా రెండు బ్రిడ్జిలు నిర్మించేందుకు కూడా టెండర్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంత వాసులు ఎంత వర్షం వచ్చినా గుండెలపై చేయి వేసుకొని నిద్రపోతున్నారని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా మాట్లాడుతూ ప్రజలకు నవరత్నాల రూపంలో సంక్షేమ పథకాలు ఇవ్వడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 126 సార్లు బటన్ నొక్కి ప్రజల బ్యాంకు ఖాతాల్లో డబ్బు వేశారని, రాబోవు ఎన్నికల్లో ప్రజలు రెండు సార్లు బటన్ నొక్కి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, చల్లా రాజశేఖర్, రెడ్డి ప్రసాద్, జమాల్‌వలీ, చాన్‌బాషా, షఫీ, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, టీపీ వెంకట సుబ్బమ్మ, బి.మరియలు, ఉమైర్, మురాద్‌బాషా, జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది

వైవీయూ : జీవితంలో సమస్యలు చుట్టుముట్టినప్పుడు వాటిని పరిష్కరించే ఆలోచన చేస్తే తప్పక మార్గం కనిపిస్తుందని వైవీయూ సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–7 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.లలిత పేర్కొన్నారు. ఆదివారం పెండ్లిమర్రి మండలం వేలూరుపాడులో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో 'ఆత్మహత్యల నివారణ–అవగాహన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ ఆత్మహత్యల నివారణపై చైతన్యం కల్పించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సైకాలజీ, బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..



పెండ్లిమర్రి మండలంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పోలియో చుక్కల ఆవశ్యకతపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, కడప పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు కోరారు. ఆదివారం కడప నగరంలోని బీజేపీ లోక్‌సభ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు.. ఆంధ్రాలో ఒకసారి, కేంద్రంలో మరొకసారి బీజేపీ సర్కార్ అనే నినాదంతో రూపొందించిన ఎన్నికల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడవసారి ఏర్పాటుకు సిద్ధమైందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ సర్కార్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌రెడ్డి, గాలి హరి ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు బత్తల పవన్ కుమార్, పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్‌కు గెజిటెట్ హోదా ఇవ్వాలి

కడప అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధశాఖలో ఐదో క్యాడర్ అయినటువంటి వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్‌కు గెజిటెట్ హోదా ఇవ్వాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని బహుళార్థ పశువైద్యశాలలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 300 వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ పోస్టులు ఉన్నాయన్నారు. అదే శాఖలోని ఎన్‌జీవో కేడర్ జూనియర్ అసిస్టెంట్ నుంచి ప్రమోషన్ పోస్టుగా గెజిటెడ్ క్యాడర్ అయినటువంటి గజిటెడ్ ఆఫీసు మేనేజర్ పోస్టును ఇస్తున్నారన్నారు. ఇది పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న 60 వేల ఉద్యోగుల ఆకాంక్ష అని, దానిని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, అన్నమయ్య జిల్లా చైర్మన్ జయప్రకాష్, జిల్లా కార్యదర్శి సదాశివయ్య, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి సాల్మన్‌రాజ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జైపాల్, కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ రాజశేఖర్

డీహెచ్‌పీఎస్ కార్యవర్గ ఎన్నిక

కడప సెవెన్‌రోడ్స్ : దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం కడప నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షునిగా ఇమ్మానియేల్, కార్యదర్శిగా కె.మునెయ్యలను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ, కోశాధికారిగా నాగేశం, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, ప్రసాద్, పెంచలయ్య, శ్రీరాములు, ఏసురత్నం, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, ఏసోబు, గోవిందులతోపాటు 21 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

6 నుంచి షహామీరియా దర్గా ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం రవీంద్ర నగర్‌లోని ఆస్థానె–యే–షహామీరియ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయని దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా మహమ్మద్ హుసేని భాష షహామీరి సాహెబ్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన గంధం, 7న ఉరుసు ఉత్సవాలు ఉంటాయని, అనంతరం నాతీయ ముషాయరా (కవి సమ్మేళనం) కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు బనారస్ నుంచి కబీర్ బనారస్, కర్ణాటక రాష్ట్రం నుంచి అన్వార్ సాదీ, డాక్టర్ మాహేర్ జమాలి, వీరితోపాటు జిల్లా నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి కూడా కవులు పాల్గొంటున్నారని తెలిపారు. భక్తులు పాల్గొని ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



ఆస్థానె-యే-షహామీరియ దర్గా

సతీష్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ 2019లో ఆ పార్టీకి రాజీనామా చేశాడు. నాలుగు ఏళ్లుగా తటస్థంగా ఉన్న ఆయన ఇటీవల తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన స్వగృహమైన వేంపల్లెకు రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అందులో మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, షాదీఖానా కమిటీ చైర్మన్ షేక్షావలి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వార్డు మెంబర్లు, తదితరులు కలిసి సతీష్‌రెడ్డిని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎంతో కష్టపడి పనిచేసినా ఫలితం లేదన్నారు. ఆ పార్టీలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేసినా చెప్పుడు మాటలు విని చమత్కారాలు, అవమానాలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో వైయస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

చింతకొమ్మదిన్నె : మండలంలోని రోడ్డుకృష్ణాపురం రైల్వేస్టేషన్, తాడిగొట్ల గ్రామాలకు వెళ్లే మార్గాలకు సీసీ రోడ్డు పనులకు ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గం జిల్లాలోని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తారు రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, నాయకులు ఓబుల్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : మండల పరిధిలోని సీ కొత్తపల్లెలో ఆదివారం అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తి వద్దనుంచి 51 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవస్వామి మాసోత్సవం

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని మగ్దూమ్ సాహెబ్ కొట్టాల గ్రామంలో గల శ్రీ ఇష్టక్యామర్థ కాలభైరవస్వామి మందిరంలో ఆదివారం కాలాష్టమి సందర్భంగా మాసోత్సవ పూజలను నిర్వహించారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న ఈ గ్రామంలో అత్యంత పురాతనమైన కాలభైరవస్వామి పూజల్లో విశేషమైనదిగా భావించే కుష్మాండ పూజల్లో పాల్గొనేందుకు పలువురు భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గుమ్మడికాయను స్వామికి సమర్పించి అనంతరం వాటిపై దీపాలను వెలిగించి హారతులు ఇచ్చారు. అర్చకులు కాలభైరవ స్తోత్రం, అష్టోత్తర శతనామావళి పఠింపజేశారు. ఆలయ మూల విరాట్ మూర్తికి భక్తులు స్వయంగా కుంకుమార్చన చేసే అవకాశం కల్పించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ఆలయ ప్రాంగణంలోని సప్తమాతృకల విగ్రహాల శిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆలయ విశేష పూజల్లో ఒకటైన కుష్మాండ పూజలో భాగంగా గుమ్మడికాయలపై హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో బాసట ప్రతినిధి మేరువ బాలాజీరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. హాజరైన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

'ఉయ్యాలవాడ' విగ్రహ ఏర్పాటుకు ఎంపీకి వినతి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలని రెడ్డి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ కోరారు. ఈ మేరకు వారు కడపలో ఆదివారం కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సుమారు 9 వేల మంది ప్రజాసైన్యంతో తిరుగుబాటు చేసిన యోధుడు నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. ఆ తిరుగుబాటును కర్కశంగా అణిచివేసిన నాటి బ్రిటీషు పాలకులు 1847 ఫిబ్రవరి 22న నాటి కడప జిల్లా కోయిలకుంట్లలో నరసింహారెడ్డిని ఉరి తీశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప సుందరీకరణలో భాగంగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే భావితరాలకు స్ఫూర్తివంతంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని తాను పరిశీలిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డిలపై ముద్రించిన బుక్‌లెట్లను ఎంపీతోపాటు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబులకు ఈ సందర్భంగా అందజేశారు.

చెన్నూరు నేతలను కలిసిన ఎంపీ

వల్లూరు : చెన్నూరుకు చెందిన పలువురు సీనియర్ వైఎస్ఆర్‌సీపీ నేతలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్బీ అంజాద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొదట పార్టీ ముఖ్య సీనియర్ నేత ముదిరెడ్డి శివరామిరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను వారి గృహంలో కలిశారు. మండలంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పెడబల్లె ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గణేష్‌రెడ్డి, సీనియర్ నేత పెడబల్లె జయభారత్‌రెడ్డిలను వారి గృహాల్లో కలిశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీకి మద్దతు ఇచ్చి పార్టీ అభ్యర్థుల విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత మాసీమబాబు, దిలీప్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.